

ప్రైవేటు బస్సు బోల్తా
పుట్టెంట్రుకల వేడుకకు వెళ్తుండగా బస్సు బోల్తాపడి ఏడుగురికి తీవ్ర, 20 మందికి స్వల్ప గాయాలైన ఘటన అద్దంకి మండలం తిమ్మాయపాలెం సమీపంలో జరిగింది. - 8లో..



ధర్మాన్ని ఆచరించండి
ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరిస్తూ దైవమార్గంలో నడవాలని త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి అన్నారు. మార్కాపురంలో ఆయన మాట్లాడారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35/27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఎండతీవ్రత పెరుగుతుంది.

సాక్షి ప్రకాశం

సోమవారం । 18 । మార్చి । 2024

రంజాన్ వేళలు
సోమవారం - ఇఫ్తార్ : సా॥ 6.25
మంగళవారం - సహరీ : ఉ॥ 4.54



న్యూస్‌రీల్

గ్రూప్-1 పరీక్షలకు 3734 మంది హాజరు

ఒంగోలు అర్బన్: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలకు 3734 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి మొత్తం 6116 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 3734 మంది హాజరయ్యారు. 2382 మంది పరీక్షకు హాజరు కాలేదు. దీంతో 57.85 శాతం హాజరు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. చీమకుర్తిలోని బీవీఎస్‌ఆర్ కాలేజి, ఒంగోలులోని క్విస్, నాగార్జున డిగ్రీ కాలేజిల్లో పరీక్ష కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ తనిఖీ చేశారు. క్విస్ కాలేజిలో ఒక అభ్యర్థి సెల్‌ఫోన్‌ను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లి ప్రశ్నపత్రాన్ని ఫొటో తీస్తుండగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి పంపే సమయంలో తనిఖీ చేయాల్సిన ప్రక్రియలో వైఫల్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

విజయోస్తు..

పదో తరగతి రెగ్యులర్, ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం పూర్తిచేశారు. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షకు అనుమతించనున్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు ఉచితంగా బస్సు సౌకర్యాన్నీ కల్పిస్తున్నారు.

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 30,929 మంది విద్యార్థులు
- 170 పరీక్ష కేంద్రాల్లో 1540 మంది ఇన్విజిలేటర్ల నియామకం
- 73 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు... మరో 9 ఫ్లయింగ్ స్క్వాడ్లు
- ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు కూడా నేటి నుంచే
- 34 కేంద్రాల్లో హాజరుకానున్న విద్యార్థులు 6918 మంది
- సెల్ రహితంగా పరీక్ష కేంద్రాలు

ఒంగోలు: పదో తరగతి రెగ్యులర్, ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నేటి నుంచి జరిగే ఈ పరీక్షలకు వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, లైటింగ్, టాయిలెట్లు, వైద్య సదుపాయం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు.



పామూరులోని పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సీఎస్, డీఓ

జిల్లాలో 30,929 మంది విద్యార్థులు:
జిల్లాలో రెగ్యులర్ పదో తరగతి పరీక్షలకు 30,929 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఇందులో 14,800 మంది రెగ్యులర్ బాలురు, 14,649 మంది రెగ్యులర్ బాలికలు ఉన్నారు. వీరు కాకుండా గతంలో పరీక్షలు రాసి ఫెయిలైన 798 మంది బాలురు, 681 మంది బాలికలు ఉన్నారు. వీరికి పరీక్షల నిర్వహణకు గాను మొత్తం 170 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసి వాటిలో 170 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 170 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను నియమించారు. 68 పరీక్ష కేంద్రాలను ''ఏ'' సెంటర్లుగా, 65 కేంద్రాలను ''బీ'' సెంటర్లుగా, 37 కేంద్రాలను సీసెంటర్లుగా ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 1540 మందిని ఇన్విజిలేటర్లుగా, మరో 23 సీ సెంటర్లలో కస్టోడియన్లను నియమించారు. పరీక్షల నిర్వహణ కోసం ఇద్దరు ప్రత్యేక తనిఖీ అధికారులను, జిల్లా స్థాయి తనిఖీ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 9, సిట్టింగ్ స్క్వాడ్లు (రెవెన్యూ) 25, సిట్టింగ్ స్క్వాడ్లు (ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్) 25, సి సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్లు (కస్టోడియన్లు) 23 ఏర్పాటు చేశారు. మొత్తం 73 సెంటర్లలో సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేసినట్లయింది. ఈ పరీక్షలు ఈనెల 18న ప్రారంభమై ఈనెల 30వ తేదీతో ముగుస్తాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

ఓపెన్ పరీక్షలకు 34 కేంద్రాలు:
జిల్లాలో ఓపెన్ స్కూల్ పది పరీక్షలకు 9 కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు 25 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పది పరీక్షలకు 1660 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు 5258 మంది హాజరవుతున్నారు. ఇందుకుగాను 365 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి పరీక్ష కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగానే భావించి పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఇప్పటికే కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు.

నో సెల్‌ఫోన్ జోన్ ఏర్పాటు:
పది రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో నో సెల్‌ఫోన్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. అధికారులతో పాటు పోలీసులు, మెడికల్ సిబ్బంది సైతం సెల్‌ఫోన్‌ను పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకూడదన్నారు. అదే విధంగా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల సమీపంలో పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థుల సౌలభ్యం కోసం
విద్యార్థుల సౌలభ్యం కోసం ఎస్ఎస్‌సీ బోర్డు ఒక ప్రత్యేక ఉత్తర్వును తాజాగా జారీ చేసింది. దాని ప్రకారం విద్యార్థులు ఇంటర్‌నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌ను సైతం పరీక్షలకు అనుమతించాలని, దానిపై విద్యార్థి చదువుతున్న పాఠశాల హెడ్మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా అనుమతించాలని ఆదేశించారు. దీనివల్ల ఫీజులు చెల్లించలేదంటూ విద్యార్థులకు హాల్‌టికెట్లు నిలిపేసే ప్రక్రియకు కాలం చెల్లినట్లయింది.

హాల్ టికెట్ ఉంటే ఉచిత ప్రయాణం
పదో తరగతి హాల్ టికెట్ ఉంటే విద్యార్థులకు ఇంటి నుంచి లేదా తాము చదువుతున్న పాఠశాల నుంచి రానుపోను ఉచిత ప్రయాణానికి అనుమతిచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు కూడా బస్సు కండక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి ఎన్నికల సంసిద్ధతపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనిలో ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 24 గంటల్లోపు ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్నీ రకాల వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ ఇప్పటికే తొలగించి ఉండాలన్నారు. అదేవిధంగా పబ్లిక్ ఆస్తులైన బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, రోడ్లు, వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్నీ రకాల రాజకీయ పరమైన ప్రకటనలు, గోడపై రాతలు వెంటనే తొలగించాలన్నారు. సి-విజిల్ మానిటరింగ్, ఫిర్యాదుల సత్వర పరిష్కారం, వార్తా పత్రికల్లోని ప్రధాన ఫిర్యాదులు, 24 గంటల్లో తీసుకున్న చర్యలు, ఫిర్యాదుల నిర్వహణ అప్లికేషన్ నివేదిక నిర్వహణ తదితర అంశాలను ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు. రోజూవారీ నివేదికలను పంపాలన్నారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీకాంత్ కేదారేనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- పైరెడ్డిపాలెం, ముండ్లమూరివారిపాలెంలో 'పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం'
- మంత్రి సురేష్‌కు బ్రహ్మరథం పట్టిన రెండు గ్రామాల ప్రజలు



పైరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పొన్నలూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు మరింతగా అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పైరెడ్డిపాలెం, ముండ్లమూరివారిపాలెం గ్రామాల్లో ఆదివారం 'పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం' కార్యక్రమం నిర్వహించి ప్రచారం చేపట్టారు. రెండు గ్రామాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించి, అడుగడుగునా గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మరింతగా అభివృద్ధి చెందాలంటే జనరంజకమైన జగనన్న పాలన కొనసాగాలన్నారు. చంద్రబాబు గతంలో 600 హామీల్లో ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మళ్లీ ఎన్నికల సమయంలో దొంగ హామీలు గుప్పిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ మేలు జరగాలనే సంకల్పంతో నవరత్న పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి ప్రతి కుటుంబ జీవన పరిస్థితులను మెరుగుపరిచారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అవినీతి, అక్రమాలకు చంద్రబాబు పెద్దపీట వేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించారన్నారు. అవ్వా, తాతలకు రూ.3 వేలు పింఛను, రైతులకు రైతు భరోసా ద్వారా రూ.13500, డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ, వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18750 అందజేశారన్నారు. ఇలా చెప్పిన ప్రతి వాగ్దానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేశారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రం జన్మభూమి కమిటీలు, పెట్టుబడిదారుల చేతిలోకి వెళ్తుందన్నారు.

రెండు నెలల్లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు:
కొండపి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించిన రెండు నెలల్లోనే నియోజకవర్గంలో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. జగనన్న ఆశీస్సులతో మీలో ఒకడిగా కొండపి నియోజకవర్గానికి వచ్చానని, ప్రజలు ఆశీర్వదించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి ప్రతి గ్రామాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానన్నారు. ముఖ్యంగా సంగమేశ్వరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగు నీటి వసతిని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ కర్నా సావిత్రి, కర్నా మస్తాన్‌రెడ్డి, దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి, దుద్దుగుంట శ్రీరాములు, సగిలి శ్రీనివాసులరెడ్డి, సన్నపురెడ్డి మాలకొండయ్య, కర్నా రామిరెడ్డి, దారా చినరామయ్య, ఆదెయ్య, మేడిద శివరామకృష్ణ, సర్పంచ్ దగ్గుపాటి లక్ష్మీకుమారి, దగ్గుపాటి శ్రీను, తాటికొండ సుందరరావు, తల్లపనేని చంద్రరావు, నల్లూరి సాంబయ్య, ముప్పరాజు కోటేశ్వరరావు, దివి మల్లికార్జున పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- ప్రజల ఆశీస్సులే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



బూచేపల్లి కుటుంబ సభ్యులను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ముండ్లమూరు: పేద, బడుగు, బలహీన వర్గాల మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మ ఒడి పథకాలు అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని రమణారెడ్డిపాలెం, వేములబండ గ్రామాల్లో ఆదివారం ఉదయం ×మన ఊరికి మన శివన్న₹ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, నందినిలకు అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులే వైఎస్సార్‌సీపీకి రానున్న ఎన్నికల్లో శ్రీరామరక్షగా నిలిచి గెలిపిస్తాయని అన్నారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసినట్లు చెప్పారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా 20 ఏళ్లుగా బూచేపల్లి కుటుంబం బీవీఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్ది పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి జగనన్న కృషి చేశారన్నారు. అన్ని వర్గాల మహిళల సంక్షేమానికి రూ.25 వేల కోట్లు నేరుగా పేద మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేసిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న మాపై నమ్మకంతో ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇచ్చినందున గెలిపిస్తే సేవకుడిగా పనిచేసి మీ రుణం తీర్చుకుంటానన్నారు. వేములబండ గ్రామానికి చెందిన కంచుమాటి అంజయ్య పండించిన చిరుధాన్యాలు రాగులను పరిశీలించారు. చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉందని రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో మహిళలు మండుటెండను సైతం లెక్కచేయక బూచేపల్లి కుటుంబ సభ్యులకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. రామాలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల ఇన్‌చార్జ్‌లు వెంకటరత్నం, నరసింహారెడ్డి, ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీలు బంకా రమణమ్మ నాగిరెడ్డి, వేముల పద్మావతి జానకిరామయ్య, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ నూకతోటి రత్తమ్మ, రమణారెడ్డిపాలెం, వేములబండ గ్రామాల నాయకులు నూతకోటి మధుబాబు, నాగాంజనేయులు, దుగ్గినేని వెంకట్, చినగోవిందు, మండల నాయకులు మేదరమెట్ల కోదండరామయ్య, ఈశ్వరాచారి, బిజ్జం కృష్ణారెడ్డి, మేడగం రమణారెడ్డి, కుంటా అచ్చారావు, భిక్షాలురెడ్డి, అప్పిరెడ్డి, మొదుళ్ల సుబ్బారెడ్డి, జిల్లెలమూడి శివయ్య, కొండారెడ్డి, అంజిరెడ్డి, అంబటి వెంకటేశ్వరరెడ్డి మేకల కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వేముల పద్మశ్రీనివాసరావు, జనమాల నాగేంద్రంపిచ్చయ్య, వంగల పద్మావతిశ్రీనివాసరెడ్డి, కందిమళ్ల గీతాంజలి, గోపనబోయిన శ్రీనివాసరావు, జమ్ముల గురవయ్య, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాగళంలో ఆకలి కేకలు

- నగదు, మందు, బిర్యానీ ఇస్తామంటూ ప్రచారం
- అయినా కానరాని స్పందన
- ఫుల్‌గా మందు..అరకొరగా ఆహారం
- అర్ధాకలితో అలమటించిన కార్యకర్తలు, అభిమానులు
- కానరాని జనసేనలు



ఒంగోలులో కాలేజీ బస్సులో ప్రజాగళం సభకు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో బొప్పూడిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజలను తరలిస్తామని జిల్లా నాయకులు ప్రచారం చేసుకున్నారు. అయితే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కరువైంది. దీంతో నగదు, మద్యం, బిర్యానీ ఇస్తామంటూ ప్రచారం చేశారు. తీరా కార్యకర్తలు వాహనాలు ఎక్కిన తరువాత టోకెన్లు ఇచ్చి తరువాత ఇస్తామంటూ మభ్యపెట్టారు. అక్కడకు వెళ్లిన తర్వాత నగదు ఎగ్గొట్టారు. అరకొరగా ఆహారాన్ని అందించడంతో వారంతా ఆకలి కేకలు పెట్టారు. మద్యాన్ని ఫుల్‌గా సరఫరా చేసి ఆహార ఏర్పాట్లు మాత్రం చేయలేదని మండిపడ్డారు.

అరకొరగా ఏర్పాట్లు..
నెల్లూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు ఒంగోలు సమీపంలో భోజనం ఏర్పాట్లు చేశామని చెప్పి తరలించారు. తీరా అక్కడకు వచ్చే సరికి కొంతమందికే ఆహారం అందించారు. ఎక్కువ శాతం మందికి భోజనం అందలేదు. వారికి మద్దిపాడు మండలం గుండ్లాపల్లి వద్ద ఏర్పాటు చేశారని చెప్పడంతో అక్కడ ఆగారు. కానీ అక్కడ కూడా భోజన ఏర్పాట్లు లేకపోవడంతో వారంతా జాతీయ రహదారిపై ఉన్న దాబాలు, హోటళ్లలో తమ సొంత నగదుతో ఆకలి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు టీడీపీ నేతపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కనీస భోజనం ఏర్పాట్లు చేయకుండా ఇంత దూరం తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో రూ.1000 ఇస్తామని బస్సులు ఎక్కించారు. తీరా బస్సు ఎక్కిన తరువాత కొంత మందికే రూ.500 చేతిలో పెట్టి మమ అనిపించారు. ఇదేంటని ప్రశ్నిస్తే తాము నాలుగు రూపాయలు వెనకేసుకోవాలి కదా నేతలు సమాధానమిచ్చారని బహిరంగ సభకు వచ్చిన వారు వాపోయారు. ఒంగోలు నగరం నుంచి 25 వేల మందిని తరలిస్తామని నేతలు బీరాలు పనికినా పట్టుమని 5 వేల మంది కూడా వెళ్లలేదు. వెళ్లిన వారికి అరకొర ఏర్పాట్లు చేశారు. కొత్తపట్నం మండలం నుంచి సభకు వెళ్లేందుకు క్యాడర్ ఆసక్తి చూపలేదు. రూ.500 నుంచి రూ.1000, మందు బాటిల్ ఇస్తామని ప్రలోభపెట్టి బస్సులో ఎక్కించారు. ఆలూరు, గాదెపాలెం, సంకువారిగుంట పంచాయతీలకు అసలు బస్సులే పంపలేదు. మోటుమాల, రంగాయపాలెం, మడనూరు, ఈతముక్కల గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సభకు రావాలని అభ్యర్థించారు.

☛ కొండపి ఎమ్మెల్యే స్వామి నియోజకవర్గం నుంచి 30 వేల మందిని తరలిస్తామని ప్రగల్భాలు పలికారు. అయితే నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బస్సులు పంపినా స్పందన కరువైంది. దీంతో చాలా బస్సులు ఖాళీగా దర్శనమిచ్చాయి. నగదు, మద్యం, బిర్యానీ ఇస్తామని ఆశ చూపినా ఒక్కో బస్సులో ఇద్దరు ముగ్గురితోనే బయలుదేరాయి. టంగుటూరు ఆర్టీసీ డిపో వద్ద ఉన్న మద్యం దుకాణం వద్ద తెలుగు తమ్ముళ్లు హల్‌చల్ చేశారు.

☛ మార్కాపురం నుంచి ప్రజాగళం బహిరంగ సభకు వెళ్లేందుకు కార్యకర్తలు ముందుకు రాలేదు. దీంతో నియోజకవర్గంలోని మార్కాపురం టౌన్, తర్లుపాడు, పొదిలి కొనకనమిట్ల మండలాల నుంచి టీడీపీ కార్యకర్తల వాహనాలు ఆలస్యంగా వెళ్లాయి. నేతలు కార్యకర్తలను బతిమిలాడుకొని నగదు, మద్యం ఆశ చూపినా అరకొరగానే తరలివెళ్లారు. మార్కాపురంలో మధ్యాహ్నం వరకు కూడా కార్యకర్తలు ముందుకురాకపోవడంతో బతిమిలాడుకుని తీసుకెళ్లారు.

☛ దర్శి నుంచి టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేసినా బస్సులు ఎక్కేవారు కరువయ్యారు. తన కళాశాలకు చెందిన బస్సులు తెప్పించినా జనాభా ఎక్కకపోవడంతో టీడీపీ నేతలు నిరాశ చెందారు. దీంతో బస్సుకు పది మంది చొప్పున, కార్లలో ఒకరిద్దరు చొప్పున సభకు వెళ్లారు. నేతలు నగదు ఆశచూపినా వెళ్లేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు.

☛ యర్రగొండపాలెం నుంచి ప్రజాగళం బహిరంగ సభకు వెళ్లేందుకు అంతగా సుముఖత చూపలేదు. బస్సులకు బదులు ఆటోలు, లారీలను పంపించడంతో కార్యకర్తలు నిరాశ చెందారు. పంచాయతీ పరిధిలో ఉన్న నాయకులు తెలుగు తమ్ముళ్లను వాహనాల్లో ఎక్కాలని బతిమిలాడారు. అయినా ససేమిరా అనడంతో రూ.500 నుంచి రూ.1000 చొప్పున నగదు పంపిణీ చేశారు. నియోజకవర్గం నుంచి 2 వేల మంది మాత్రమే తరలివెళ్లారు. నియోజకవర్గంలోని ప్రధాన టీడీపీ వర్గం ప్రజా గళం సభకు డుమ్మా కొట్టింది. ఎరిక్షన్‌బాబుకు టికెట్ ఇస్తే తాము మద్దతు ఇవ్వమని, ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని తెగించి చెప్పిన మన్నే రవీంద్రకు చెందిన వర్గం ప్రజాగళం సభకు హాజరు కాలేదు.

☛ కనిగిరి నియోజకవర్గం నుంచి ప్రజాగళం బహిరంగ సభకు స్పందన కరువైంది. వాహనాలు వచ్చినా కార్యకర్తలు ఎక్కకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు కదల్లేదు. కొన్ని మండలాల్లో టీడీపీ మండల నాయకులు, మందు, బిర్యానీ ఆశ చూపి తీసుకువెళ్లారు.

☛ గిద్దలూరు నియోజకవర్గం నుంచి ప్రజాగళం సభకు అరకొరగా తరలివెళ్లారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, కార్లలో నగదు, మద్యం, బిర్యానీ ఇచ్చి తరలించారు. జనసేన నుంచి స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అరకొరగా వెళ్లారు.

సిద్ధం సభ సమయంలో నానా హంగామా చేసిన పచ్చ చానళ్లకు..నేడు కూటమి నేతలు చేసిన అరాచకాలు కనిపించలేదా అని పలువురు నేతలు ప్రశ్నించారు.



టంగుటూరు ఆర్టీసీ డిపో వద్ద మద్యం, షోడా, మంచింగ్ ప్యాకెట్లతో తెలుగు తమ్ముళ్లు



వైపాలెం నుంచి మండుటెండలో కనీస రక్షణ లేకుండా కార్యకర్తలను అభిమానులను తరలిస్తున్న దృశ్యం

అందరి సమన్వయంతో పనిచేస్తా

- రాపర్ల గ్రామంలో పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున



రాపర్లలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ కుటుంబంలోని ప్రతి కార్యకర్త, నాయకులని కలుపుకొని అందరి సమన్వయంతో పనిచేస్తానని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, సంతనూతలపాడు అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని రాపర్ల గ్రామంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మేరుగు మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ జెండా మళ్లీ ఎగిరేలా అందరం సమష్టి కృషితో పనిచేయాలన్నారు. మంత్రి మేరుగు నాగార్జునకు పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికిన గ్రామ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మొదటిగా డా.బి.ఆర్ అంబేడ్కర్, డా. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, సీనియర్ నాయకులు తుమ్మల బ్రహ్మానంద రెడ్డి, అన్నె వెంకట్రామిరెడ్డి, మాలె వెంకట్రామి రెడ్డి, సర్పంచ్ ఢాకా అనసూర్యమ్మ రమణా రెడ్డి, ఎంపీటీసీ కట్టెడ అంజమ్మ, రాపర్ల, అమ్మనబ్రోలు సొసైటీ అధ్యక్షుడు ఇనగంటి వెంకట రమణా రెడ్డి, కోయి హనుమయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

మార్కాపురం: స్థానిక కోర్టు సెంటరులోని ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తి దొంగతనానికి ప్రయత్నించాడు. ఏటీఎంలో యంత్రాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా అలారం మోగడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోగా గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ ఏటీఎంను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై ఆదివారం రాత్రి వరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం


జామాయిల్ తోటలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

టంగుటూరు: గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి ఆర్పకుండా పడేయడంతో జామాయిల్ తోట దగ్ధమైన సంఘటన టంగుటూరు గ్రామంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు.. టంగుటూరు గ్రామానికి చెందిన రావి ప్రసాద్ నాగున్నర ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి కంచె వెంట పడేయడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు అదుపుచేశారు. అప్పటికే రెండు ఎకరాల జామాయిల్ తోట కాలిపోయింది. రూ.70 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ అధికారి రమణారెడ్డి తెలిపారు.


గాయపడిన చిన్నారులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

ప్రైవేట్ బస్సు బోల్తా

- పుట్టెంట్రుకలు తీయించేందుకు కోటప్పకొండ వెళ్తుండగా ప్రమాదం
- అద్దంకి మండలం తిమ్మాయపాలెం వద్ద ఘటన
- ఏడుగురికి తీవ్ర, 20 మందికి స్వల్పంగా గాయాలు
- క్షతగాత్రులంతా దర్శి మండలం కొర్లమడుగు గ్రామస్తులు
- పరామర్శించిన వైఎస్సార్ సీపీ దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు


బోల్తా పడిన బస్సు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు, స్థానికులు

అద్దంకి: పుట్టెంట్రుకల వేడుకకు వెళ్తుండగా బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడటంతో ఏడుగురికి తీవ్ర, 20 మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం అద్దంకి మండలం తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దర్శి మండలంలోని కొర్లమడుగు గ్రామానికి చెందిన కోట్ల రాజశేఖర్‌రెడ్డి తన కుమార్తె పుట్టెంట్రుకలు కోటప్పకొండ తీయించేందుకు ముహూర్తం నిశ్చయించుకున్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సులో 40 మంది బంధువులతో ఆలయానికి ఉదయాన్నే బయలుదేరారు. ఈ క్రమంలో అద్దంకి మండలం తిమ్మాయపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలోకి రాగానే బస్సు కమాన్ కట్ట బోల్టు ఊడిపోవడంతో స్టీరింగ్ కంట్రోల్ కాక రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బస్సు వెనుక, ముందు వైపు అద్దాలు పగలగొట్టి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ఎస్సై నాగరాజు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108తోపాటు ప్రైవేట్ వాహనాల్లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.


బాధితులను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

క్షతగాత్రుల్లో 9 మంది పిల్లలు

తీవ్రంగా గాయపడిన వారిలో యర్రం ధనమ్మ, నాగమని, కోటయ్య, శానం నారాయణరెడ్డి, కోటిరెడ్డి, అంకమ్మ ఉన్నారు. శాంతి, కోటిరెడ్డి, పావని, వెంకాయమ్మ, సుబ్బారావు, ఆదిలక్ష్మి, సాయిరోషన్, అనసూర్యమ్మ, తన్విక, రమణారెడ్డి, రాణి, కీర్తన, చంద్రమౌళి, సాయిశ్రీ, హర్ష, హేమేష్, బి.సుబ్బారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిలో 9 మంది పిల్లలు ఉన్నారు. ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

క్షతగాత్రులకు బూచేపల్లి పరామర్శ

దర్శి: బస్సు ప్రమాదం విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఒంగోలు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఏ అవసరం వచ్చినా తనకు వెంటనే తెలియజేయాలని సూచించారు. శివప్రసాద్‌రెడ్డి వెంట సర్పంచ్ బత్తుల సుబ్బలక్ష్మి సుబ్బారెడ్డి తదితరులున్నారు.

ఎంపీ వైవీతో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ భేటీ


వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న షంషేర్, కృష్ణ, బద్రీ తదితరులు

మార్కాపురం: ఏపీ మైనార్టీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మీర్జా షంషేర్ అలీబేగ్ ఆదివారం తాడేపల్లిలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని షంషేర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఏఎంసి డైరెక్టర్ పీఎల్‌పీ యాదవ్, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్‌కు సూచించారు. రానున్న 50 రోజులు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందని, సంక్షేమ లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఏఎంసీ డైరెక్టర్ డాక్టర్ మగ్బుల్ బాషా, మైనార్టీ నేత జిలానీ తదితరులు ఉన్నారు.

ధర్మాన్ని ఆచరించండి


స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న చిన్నజీయర్ స్వామి

- భక్తులకు త్రిదండి చిన్నజీయర్ స్వామి ఉద్బోధ

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడుచుకుని దేవుడి కృపను పొందాలని శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రవచించారు. సాధనిక అమలక లక్ష్మీనారాయణస్వామి (వెంకచ్చమ్మ) ఆలయం సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో చిన్నజీయర్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, దైవానుగ్రహం ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశాన్ని గ్రహించి, ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. వేదాంతం అంటే నైరాశ్యం కాదని అందులో ఉన్న గొప్ప విషయాలను తెలుసుకోవాలన్నారు. శ్రీమన్నారాయణ చూపిన సన్మార్గంలో నడవాలన్నారు.

సీతారామ కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం ఘట్టాలను చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవ పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజల్లో ఏపీఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ అధ్యక్షులు డాక్టర్ డి.కృష్ణారెడ్డి, కోశాధికారి వై.వెంకటరెడ్డి, కార్యదర్శి పి.చెంచయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- పట్టణంలోని కందుల ఓబులరెడ్డి హాస్పిటల్‌ను చిన్నజీయర్ స్వామి సందర్శించి రోగులకు పండ్లు, ప్రసాదాలు అందించారు. హాస్పిటల్ చైర్మన్ గౌతమ్ నాగిరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలి


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, సత్యన్నారాయణరెడ్డి, వైఎం ప్రసాద్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో నూతన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం దద్దాల నారాయణ యాదవ్, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వాకుమళ్ల రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దద్దాలనారాయణ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గాలకు సంక్షేమం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగించినట్లు చెప్పారు. అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే నన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తెచ్చారని కొనియాడారు. పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఫ్యాను గుర్తుకు ఓటు వేసే విధంగా చైతన్య వంతులను చేయాలన్నారు. గ్రామ, వార్డుల స్థాయిలో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధిని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేనన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి, వేయించి దద్దాల నారాయణ యాదవ్‌ను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నను మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ ఇండ్లా ధనలక్ష్మీ, కోటంశెట్టి మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ ఆస్ట్రేలియా కోఆర్డినేటర్ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలమాల కొండారెడ్డి, గజ్జల కోటిరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, బూచేపల్లి అంకిరెడ్డి, సిద్దారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, దానపురెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాధవరావు, డేవిడ్, బాబు, నాగేంద్ర, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, నాగిరెడ్డి, శ్రీహరిరెడ్డి, పేతూరు, కరుణాకర్, కటికల వెంకటరత్నం, పెద్దిరెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, చంటి, జనార్దన్‌రెడ్డి, న్యాయవాది ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం


ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

- ఆర్యవైశ్యులకు అండగా ఉంటా ఆదరించండి
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించబోతోందని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన స్థానిక సౌజన్య ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌తో ప్రచారం చేసుకున్నానని, గిద్దలూరు ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో రెండో అత్యధిక మెజారిటీ సాధించానన్నారు. జగనన్న ఆదేశాలతో రానున్న ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు. తనతోపాటు ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ కృషి చేస్తున్న కృషిని వివరించారు. టీడీపీ నేతలు అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు ఓసీలు కూడా మరోమారు సీఎంగా జగన్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారనడంలో ఎలాంటి సందేహాలు లేవన్నారు.

మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. అన్నా రాంబాబు అందరివాడని, ఆయన విజయానికి ఆర్యవైశ్యులంతా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్యవైశ్య అన్నపూర్ణ సత్రంకమిటీ అధ్యక్షులు బొగ్గు శ్రీనివాసులు, మూర్తి రమేష్, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థాన చైర్మన్ కమలా కేశవరావు, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షురాలు చాటకొండ రాధ, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు రావూరి జనార్దన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు పి.బాలసుబ్బారావు, వాసవీ రంగయ్య, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ బద్రీనాథ్ తదితరులు మాట్లాడారు. అనంతరం అన్నా రాంబాబు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బి.శేషయ్య, పారిశ్రామిక వేత్త తాళ్లపల్లి ప్రసాద్, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, నగేష్, చంద్ర, కృష్ణ, మాజీ కౌన్సిలర్ లీలావతి, సూరె శ్రీదేవి, న్యాయవాది హరికృష్ణ, గొంట్ల రాంబాబు, రాఘవేంద్ర, పానుగంటి మురళీ, బొగ్గరపు రమణ, రామడుగు రమేష్, ఏఎంసి డైరెక్టర్ మగ్బుల్ బాషా, నజీర్ అహ్మద్, పత్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పలకు సేవలందించడమే ధ్యేయం


త్రిపురాంతకం అయ్యప్ప దీక్ష ప్రచార సమితిలో మాట్లాడుతున్న అయ్యప్ప దీక్ష గురుస్వాములు

త్రిపురాంతకం: అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ద్వారా అయ్యప్ప దీక్ష స్వాములకు సేవలందిస్తామని సమితి జాతీయ అధ్యక్షుడు రాజ్ దేశ్‌పాండే పేర్కొన్నారు. త్రిపురాంతకంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గత 41 ఏళ్లుగా పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సంస్థ ద్వార అనేక కార్యక్రమాలను చేపట్టామని పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌గాంధీ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప దీక్షలో ఉన్నపుడే భక్తి కాదని, నిరంతరం అది కొనసాగాలని పిలుపునిచ్చారు. జాతీయ కార్యదర్శి కొండ దేవయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి గురుస్వామి మాట్లాడుతూ ఇప్పటికే వందకు పైగా అయ్యప్ప దేవాలయాలకు సహకారం అందించామన్నారు. ప్రచార కార్యదర్శి వాసు గురుస్వామి, కార్యదర్శి హరినారాయణ గురుస్వామి మాట్లాడుతు జాతీయ స్థాయిలో అయ్యప్ప ఆలయాల్లో దీప దూప నైవేద్యాలు నిరంతరం జరిగేలా, భజనలు చేసేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి ఆచరణలో ఉంచామని వివరించారు. తెలంగాణ కేశవగురుస్వామి, కోశాధికారి రంగాచారి గురస్వామి తదితరులు మాట్లాడారు. అయ్యప్ప గురస్వాములు మల్లికార్జునశర్మ, రామిరెడ్డి, శంకరరావువు గురుస్వామి, భాస్కరరెడ్డి, శివారెడ్డి, హరికృష్ణ, సుందరరెడ్డి, గురునాథం, వెంకటరెడ్డి, విశ్వనారాయణశాస్త్రి, గురస్వాములు పాల్గొన్నారు.

నేను ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్


మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

ఒంగోలు: తాను ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నానంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. తాను కాంగ్రెస్ నుంచి వాసన్న వెంటే ఉన్నానని, వైఎస్సార్ సీపీలో తనకు ఎనలేని ప్రాధాన్యత కల్పించారన్నారు. నగర అధ్యక్షునిగా ఏడేళ్లు, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశానని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా మూడు పర్యాయాలుగా కొనసాగుతున్నానన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ఒంగోలు సూపర్‌బజార్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరినట్లు రావడం దారుణమన్నారు. దీనిపై వారిని వివరణ కోరితే..సవరణ వేస్తామని చెప్పారని, కానీ ఇంతలోనే దీనిని కొంతమంది కావాలని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం బాధాకరమన్నారు. తాను ఎప్పుడూ వైఎస్సార్ సీపీ వెంటే ఉంటానని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు


ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళ

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెదజల్లాయని గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని కొత్తపల్లెలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేశారన్నారు. జగనన్న పాలనలో ప్రతి పేద కుటుంబానికి ఏదో రకంగా లబ్ధిపొందిందన్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిని అయిన తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామక్రిష్ణ, కాతాదీపికా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కోటా నరసింహులు, పార్టీ మండల కన్వీనర్ పూలి రామక్రిష్ణారెడ్డి, సచివాలయం కన్వీనర్ ఓబులరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కావేటి ఈశ్వర్ నాయుడు, శ్రీరాములు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, దొంతా లక్ష్మీదేవి, లొక్కు రమేష్, కోఆప్షన్ సభ్యులు, మహిళా నాయకురాలు బండారు నిర్మలాదేవి, బెల్లం రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

పొదిలి రూరల్: రెండు బైకులు ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలైన సంఘటన దర్శి మండలంలోని రాజంపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. క్షతగాత్రుల బంధువు కథనం మేరకు.. పొదిలి విశ్వనాథపురానికి చెందిన అస్మత్ బాషా, చరణ్‌తేజ బైక్‌పై దర్శి వెళ్తున్నారు. అదే మార్గంలో ముందు వెళ్తున్న రాజంపల్లికి చెందిన గుర్రపుశాల నాగార్జున గేదెలు అడ్డురావడంతో అకస్మాత్తుగా బ్రేకులు వేయగా అదుపుతప్పి పడిపోయాడు. వారి వెనుకే వెళ్తున్న అస్మత్, చరణ్ కూడా ముందు బైక్‌ను ఢీకొని పడిపోయారు. క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.